క్లుప్తంగా

ఇసుక లారీల పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన లారీ

సిద్దిపేటకమాన్: ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సిద్దిపేట పట్టణ శివారు రాజీవ్ రహదారి పక్కన ఉన్న శివ కాంట వద్ద ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, టూటౌన్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. వేబిల్లులు లేకుండా హైదరాబాద్‌కు ఇసుక అక్రమ రవాణా చేయడానికి సిద్ధంగా ఉన్న మూడు ఇసుక లారీలను పోలీసు లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి



దూడపై దాడి చేసిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాముడు

మద్దూరు(హుస్నాబాద్): రైతులు తమ పశువులను రాత్రి సమయంలో పొలం వద్ద కాకుండా ఇంటి వద్దే కట్టేసుకోవాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్ రాముడు అన్నారు. మండలంలోని కూటిగల్ గ్రామంలో రైతు జ్ఞానమైన శ్రీనివాస్ వ్యవసాయ బావి వద్ద గుర్తు తెలియని జంతువు దాడిలో గాయపడిన లేగదూడను పరిశీలించారు. దాడికి సంబంధించిన ఆనవాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువులు ఉన్న ప్రదేశంలో కంచె ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు.

14 వరకు దరఖాస్తుకు గడువు

హుస్నాబాద్‌రూరల్: పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ పరీక్షకు ఈనెల 14 వరకు రూ.100ల జరిమానాతో దరఖాస్తు చేసుకోవచ్చని హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్ గురువారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పాలిటెక్నిక్ చేస్తే త్వరగా ఉద్యోగాల్లో చేరొచ్చన్నారు.

ముందస్తులో మనమే టాప్



సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం

- రూ.5.84 కోట్ల వసూళ్లతో బల్దియా
- వన్‌టైం పేమెంట్ ద్వారా రాయితీ
- సద్వినియోగం చేసుకున్న సిద్దిపేట
- ప్రత్యేక డ్రైవ్‌తో సత్ఫలితాలు
- నామమాత్రంగా మిగతా మున్సిపాలిటీలు

రాష్ట్ర ప్రభుత్వం ఆయా మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఇచ్చిన సదవకాశాన్ని సిద్దిపేట బల్దియా సద్వినియోగం చేసుకొంది. ఒకేసారి ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్ను చెల్లించే యజమానులకు సర్కారు ఐదు శాతం రాయితీ ప్రకటన సత్ఫలితాలు ఇచ్చింది. కేవలం 30 రోజుల్లో రూ 5.84 కోట్లు ముందస్తుగా వసూళ్లు చేసి సిద్దిపేట రాష్ట్ర వ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచింది. జిల్లాలోని చేర్యాల బల్దియాలో నిరాశాజనకంగా, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ మున్సిపాలిటీల్లో నామ మాత్రంగా ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు.

సిద్దిపేటజోన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్ల ప్రక్రియ వేగవంతం, మొండి బకాయిలు పేరుకోకుండా ప్రభుత్వం సబ్సిడీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుత 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను ముందస్తుగా ఒకేసారి చెల్లించే వారికి పన్నులో ఐదు శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా మార్చి నిర్దేశించిన లక్ష్యం ప్రక్రియ ముగిసిన తర్వాత ఏప్రిల్ 1 నుంచి 30 వరకు రాయితీ సద్వినియోగం కోసం గడువు ఇచ్చారు. ఆయా మున్సిపాలిటీల్లో పాత బకాయిలులేని వారు ఈ పథకానికి అర్హులని నిబంధన విధించారు. మున్సిపాలిటీలకు టార్గెట్‌ను ప్రభుత్వం నిర్దేశించింది. గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో సిద్దిపేట మున్సిపల్ 8632 అసెస్మెంట్‌ల ద్వారా రూ.5.84 కోట్లు అత్యధికంగా అడ్వాన్స్ చెల్లింపులో ఆస్తిపన్ను వసూలు చేసి అగ్రగామిగా నిలిచింది.

మరో అడుగు పడితే కాసులే

జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఆస్తిపన్నును ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇచ్చే ఆఫర్ ప్రకటించింది. దీనితో ఆయా మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో రెవెన్యూ విభాగం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అసెస్మెంట్ వారీగా ఆస్తిపన్ను వసూళ్ల ప్రక్రియ వేగవంతం చేశారు. సిద్దిపేట మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి క్రమం తప్పకుండా ప్రతీ ఏడాది సక్రమంగా ఆస్తి పన్ను కట్టేవారిని ప్రత్యేకంగా కలిశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను ఒకేసారి కట్టితే అందులో ఐదు శాతం రాయితీ ఇచ్చే అవకాశం గురించి వివరించారు. ప్రత్యేకంగా డ్రైవ్, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ప్రతి అసెస్మెంట్ యజమానిని కలిసి చైతన్య పరిచారు. బిల్ కలెక్టర్ నుంచి కమిషనర్ వరకు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 35625 అసెస్మెంట్‌లలో పాత బకాయిలు లేని 8632 అసెస్మెంట్ నుంచి రూ.5.84 కోట్లు అడ్వాన్స్‌గా వసూలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 140 మున్సిపాలిటీల్లో సిద్దిపేట 43.04 శాతం వసూళ్లతో మొదటి స్థానంలో నిలిచింది. మరోవైపు జిల్లాలోని మిగతా నాలుగు మున్సిపాలిటీల్లో ప్రక్రియ ఫలితాలు నామమాత్రంగా వచ్చాయి. ఒక్క గజ్వేల్ పట్టణంలో కొంత ఊరట అని చెప్పాలి. గజ్వేల్ మున్సిపాలిటీలో 12212 అసెస్మెంట్‌లలో 1391 అసెస్మెంట్ ద్వారా రూ.1.27 కోట్లు వసూలు కాగా, దుబ్బాకలో 6088 మొత్తం అసెస్మెంట్లు ఉండగా వాటిలో 675 నుంచి రూ.32 లక్షలు, హుస్నాబాద్‌లో 1023 అసెస్మెంట్ల ద్వారా రూ. 32 లక్షలు, చేర్యాల మున్సిపల్ పరిధిలో మొత్తం 5097 అసెస్మెంట్లు ఉండగా వాటిలో 337 అసెస్మెంట్లల ద్వారా కేవలం రూ.28 లక్షలు వసూలు చేశారు. మిగతా నాలుగు చోట్ల అధికార యంత్రాంగం ప్రజలను మరింత చైతన్యపరిచి రాయితీపై విస్తృత ప్రచారం చేసి ఉంటే ప్రభుత్వ ఖజానాకు మరింత కాసుల వర్షం కురిసేది.

సమష్టి ప్రయత్నం



సిద్దిపేట మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ ఐదు శాతం రాయితీ ప్రక్రియ సానుకూల ఫలితాలు ఇచ్చింది. సమిష్టి కృషి, నిరంతర పర్యవేక్షణ వల్ల టాప్‌గా నిలిచాం. ఇదే స్ఫూర్తితో 2024- 25 ఆర్థిక లక్ష్యం అధిగమిస్తాం.

– ప్రసన్న రాణి,
మున్సిపల్ కమిషనర్, సిద్దిపేట

ధాన్యాన్ని వెంటనే తరలించాలి

డీఆర్‌డీఏ జయదేవ్‌ఆర్యా



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ జయదేవ్‌ఆర్యా

నంగునూరు(సిద్దిపేట): వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా వెంటనే మిల్లులకు తరలించాలని డీఆర్‌డీఏ జయదేవ్‌ఆర్యా ఆదేశించారు. గురువారం రాంపూర్‌లో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు, రైతుల వివరాలు ఇన్‌చార్జి ఏపీఎం లింగంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నంగునూరులో నర్సరీ, ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్, సీసీలు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం భల్లునాయక్‌తండాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లకావత్ వీరన్న వారం కిందట వడదెబ్బతో మృతి చెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పరామర్శించారు. రామన్న మృతికిగల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

ఓటుహక్కు వజ్రాయుధం



చేర్యాలలో కేంద్రబలగాల కవాతు

చేర్యాల(సిద్దిపేట): ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధమని, ఓటర్లు తమ ఓటుహక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామని సీఐ శ్రీను అన్నారు. ఎంపీ ఎన్నికల నేపథ్యంలో గురువారం కేంద్ర బలగాలతో కలిసి పోలీస్ సిబ్బంది చేర్యాలతోపాటు మండలపరిధిలోని ఆకునూరులో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

సిద్దిపేటకమాన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేటలో వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు, టూటౌన్ సీఐ ఉపేందర్, త్రీ టౌన్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో గురువారం కేంద్ర బలగాలతో కలిసి పోలీసు సిబ్బంది ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

మిరుదొడ్డి(దుబ్బాక): ఓటు వజ్రాయుధంలాంటిదని, ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ కోరారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని అల్వాల, చెప్యాలతో పాటు, అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో గురువారం మిరుదొడ్డి ఎస్‌ఐ బోయిని పర్శరాములు, పోలీస్ సిబ్బంది కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఎవరైన అల్లర్లకు పాల్పడితే గ్రామ యువకులు సీ విజిల్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి ఫిర్యాదు చేయొచ్చని ఎస్‌ఐ సూచించారు.

గజ్వేల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని గజ్వేల్ సీఐ సైదా పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం గజ్వేల్ మండలం బూర్గుపల్లి, బెజుగామ గ్రామాల్లో పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు.

నిర్భయంగా ఓటు వేయాలి

మద్దూరు(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. గురువారం మండలంలోని నర్సయపల్లి, కొండాపూర్ గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరిగేలా చర్యలు చేపట్టామన్నారు. ఎవరైన ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

క్షీరసాగర్‌లో ..

ములుగు(గజ్వేల్): మండలంలోని క్షీరసాగర్ గ్రామంలో గురువారం సాయంత్రం కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు విషయంలో ఎవరైన బెదిరింపులకు పాల్పడితే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. కవాతులో ములుగు, మర్కూక్ ఎస్‌ఐలు విజయ్‌కుమార్, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రలోభాలకు లోనుకాకుండా..

సిద్దిపేటరూరల్: ఓటుహక్కును ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా వినియోగించుకోవాలని రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీను అన్నారు. గురువారం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కోహెడరూరల్(హుస్నాబాద్): పార్లమెంట్ ఎన్నికల వేళ బీఆర్‌ఎస్, బీజేపీలకు భారీ షాక్ తగిలింది. మండలంలోని రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీజేపి నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన కార్యకర్తలందరినీ కంటి రెప్పలా కాపాడుకుంటామన్నారు.

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్, బీఎస్పీల నాయకులు సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పార్టీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం కేశనాయక్ తండా గ్రామ పరిధిలోని గొల్లపల్లి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, అక్కన్నపేట మాజీ ఎంపీటీసీ సభ్యుడు బండి సమ్మయ్య, మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య తదితరులు మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల సంజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.